సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



సిక్కోలు మణిపూసలు

ముగ్గురు సిక్కోలు వాసులకు వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు వచ్చాయి. వారు హర్షం వ్యక్తం చేశారు. - IIలో



మృత్యు తీగలు

విద్యుత్ షాక్‌తో తల్లీకూతుళ్లు మృతి చెందారు. అరవసల్లిలో ఘటన జరిగింది. - IIలో

ఉచితంగా శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో 30 రోజులు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ కళ్లూరు శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్


● క్వింటా కూరగాయలతో..



అవలింగి నీలమణి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని గురువారం శాకంబరీ దేవిగా అలంకరించారు. క్వింటా కూరగాయలు, పండ్లతో అలంకరించారు.

– సారవకోట

● లక్ష్మీరూపాయ



స్కాట్‌పేట వద్ద బదిరాంబికా దేవిని గురువారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

– ఎల్.ఎన్.పేట

● సైకత సరస్వతి



సరస్వతీ దేవి పూజలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వంశధార తీరాన సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు గేదెల హరికృష్ణ. గాజులకొల్లివలస గ్రామం సమీపంలోని సంగమేశ్వర ఆలయం వద్ద సరస్వతీదేవి ప్రతి రూపానికి ప్రాణం పోశారు.

– ఆమదాలవలస రూరల్

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు రేపు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతాయని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఉదయం 10 గంటల నుంచి 6వ స్థాయీ, 11 గంటల నుంచి 3వ, 12 గంటల నుంచి 5వ, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 2వ, 3 గంటల నుంచి 4వ, 4 గంటల నుంచి 7వ, సాయంత్రం 5 గంటల నుంచి 1వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని షెడ్యూల్‌ను ప్రకటించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైస్ చైర్‌పర్సన్లు సిరిపురపు జగన్మోహనరావు, పాలిన శ్రావణి, వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి వివిధ స్థాయి సంఘ సమావేశాలకు అధ్యక్షత వహించనున్నారని, సంబంధిత కమిటీల జెడ్పీటీసీలు, అధికారులు శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సీఈఓ సూచించారు.

కొరసవాడలో భారీ వర్షం



కాగువాడలో కురిసిన భారీ వర్షం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ, కాగువాడ, బూరగాం గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉండడంతో ఉక్కపోతతో ఉన్న ప్రజలకు సాయంత్రం వర్షం పడడంతో కొంత ఉపశమనం కలిగింది. పాతపట్నం మండల కేంద్రంలో వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గంట పాటు వాన కురవడంతో రాకపోకలన్నీ స్తంభించాయి. కొరసవాడ, కాగువాడ, బురగాం, రొంపివలస, రొమదల తదితర గ్రామాల్లోని పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భక్తజన జాతర..

నవరాత్రి వైభవం

ఆలయ ఆవరణ ఊరి చివరి వరకు విస్తరించింది. అమ్మ మంత్రధ్వని దారుల గుండా ప్రతిధ్వనించింది. తల్లి జాతర చివరి రోజున ఊరంతా కేరింతలు కొట్టింది. రమారమి మూడు లక్షల మంది భక్తుల రాకతో కోటబొమ్మాళి మహాపుణ్యక్షేత్రాన్ని తలపించింది. కొత్తమ్మ తల్లి ఉత్సవం ఉత్సాహంగా జరిగింది. వీధుల్లో విద్యుత్ అలంకరణలు, కూడళ్లలో సాంస్కృతిక ప్రదర్శనలు, కోవెలలో ప్రత్యేక కార్యక్రమాలతో మూడు రోజులు ఇట్టే గడిచిపోయాయి.

– టెక్కలి, కోటబొమ్మాళి





కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి జాతర మహోత్సవానికి హాజరైన జనవాహిని



అమ్మవారి సన్నిధిలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు



కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున ముర్రాటలతో అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

175 స్థానాలకు పోటీ చేసే సత్తా ఉందా..?

● టీడీపీ తీరుపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్ ధ్వజం

నరసన్నపేట: నేరుగా అన్ని స్థానాల్లో పోటీ చేసే సత్తా లేని టీడీపీ సీఎం వైఎస్ జగన్‌ను ఓడించడం కలలో మాట అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తాము 175 స్థానాల్లో పోటీ చేస్తామని, టీడీపీ పోటీ చేయగలదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. మండలంలోని రావులవలసలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఒకసారి మామకు వెన్ను పోటు పొడిచి చంద్రబాబు సీఎం అయ్యారని, ఆ తర్వాత రెండుమార్లు బీజేపీ అండతో గెలిచారని, ఇప్పుడు దత్త పుత్రుడు, మరికొందరి సాయం కోసం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. తప్పు చేశారు కాబట్టే చంద్రబాబు జైలుకెళ్లారని అన్నారు. దేశంలోనే అత్యున్నత న్యాయవాదులతో వాదనలు వినిపించినా కనీసం బెయిలు కూడా ఇన్నాళ్లు రాలేదంటే ఆయన చేసిన అవినీతి ఎంత స్పష్టంగా ఉందో అర్థం అవుతుందన్నారు. తప్పు చేసి బుకాయించడం సిగ్గు చేటని అన్నారు. రానున్న ఎన్నికల్లో మీరు ఎన్ని గుంపులుగా వచ్చినా సింగిల్‌గా పోటీ చేసి వైఎస్సార్ సీపీ సత్తా చాటుతుందని మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దాడ బాలభూపాలనాయుడు, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ఆదిత్యుని సన్నిధిలో కొమ్మినేని



కొమ్మినేని దంపతులకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న కృష్ణమాచార్యులు, శంకరశర్మ తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు (కెఎస్ఆర్) సతీసమేతంగా గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ అధికార సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం కుటుంబ సమేతంగా వచ్చిన వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ విశిష్టతను, పర్వదినాల ప్రత్యేకతలను కొమ్మినేని దంపతులకు శంకరశర్మ వివరించారు. తీర్థ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, జిల్లా పౌరసంబంధాల అధికారి చెన్నకేశవరావు, డీపీఆర్ఓ బాలమాన్‌సింగ్ ఉన్నారు.

రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్ల అందజేత

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎఫ్ఎన్ఎస్ పథకం కింద ప్రాసెసింగ్ యూనిట్లు రాయితీపై అందించేందుకు వ్యవసాయ కమిషనర్ ద్వారా జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు 30 యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దీనిలో తృణధాన్యాలు పిండిమిల్లువి రెండు హెచ్‌పి 10 యూనిట్లు ఒక్కోదానికి రూ.12వేలు రాయితీ, మూడు హెచ్‌పీ 10 యూనిట్లు ఒక్కో దానికి రూ.15 వేలు రాయితీ, తృణధాన్యాలు ప్రాసెసింగ్ ఏడు యూనిట్లు, అపరాల పిండి మిల్లు ఒక్కటి ఒక్కోదానికి రూ.1.25లక్షలు రాయితీ, మొక్కజొన్న గింజవేరుచేసే యూనిట్లు రెండు ఒక్కోదానికి రూ.30వేలు రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. పై యూనిట్ల సరఫరాకు ఆసక్తిగల వారు జిల్లా వ్యవసాయాధికారికి కొటేషన్ ఇవ్వాలని, నిర్దిష్ట ప్రమాణాలు, పై మిషనరీలో ఉన్న అనుభమున్న వాటి ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని కోరారు.

15,059 మందికి రూ. 15.09 కోట్లు



జగనన్న చేదోడు లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్ తదితరులు

● జగనన్న చేదోడు నగదు విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: వరుసగా నాల్గో ఏడాది జగనన్న చేదోడు నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 6,393 మంది రజక లబ్ధిదారులకు రూ.6.39కోట్లు, 2,710 మంది నాయీ బ్రాహ్మణులకు రూ. 2.71 కోట్లు, 5,956 మంది దర్జీలకు రూ.5.95 కోట్లు మొత్తం 15059 మంది లబ్ధిదారులకు రూ. 15.059 కోట్ల జమ చేసినట్లు తెలిపారు.

- ఆమదాలవలస నియోజకవర్గంలో 2,094 మందికి రూ. 2.09 కోట్లు
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో 2,210 మందికి రూ.2.21కోట్లు
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 1,610 మందికి రూ. 1.61 కోట్లు
- నరసన్నపేట నియోజకవర్గంలో 2,172 మందికి రూ. 2.17 కోట్లు
- పలాస నియోజకవర్గంలో 1,340 మందికి రూ. 1.34 కోట్లు
- పాతపట్నం నియోజకవర్గంలో 1,590 మందికి రూ. 1.59 కోట్లు
- శ్రీకాకుళం నియోజకవర్గంలో 2,235 మందికి రూ. 2.23 కోట్లు
- టెక్కలి నియోజకవర్గంలో 1,808 మందికి గాను 1.80 కోట్లు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా నమూనా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ రాజాపు హైమావతి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గంగు శారద, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, పోలినేటి కార్పొరేషన్ చైర్మన్ గంగు శారద, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సమస్య తీరింది



గతంలో పండగ సమయంలో టైలరింగ్ సామగ్రి, ఇతర మిషనరీ కొనుగోలుకి పెట్టుబడి సమస్యలు ఉండేవి. అప్పులు తీసుకుని చేసేవాళ్లం. జగనన్న చేదోడుతో పెట్టుబడి సమస్య తీరింది. సీఎంకు టైలర్లు రుణపడి ఉంటారు.

– జి.పాపారావు టైలర్ శ్రీకాకుళం.

వృత్తికి ప్రాణం పోశారు



నాయీ బ్రాహ్మణులు వృత్తిని వీడి చాలా మంది ఇతర పనులకు వెళ్తున్నారు. వృత్తిని నమ్ముకుంటూ ఉన్న వారికి ఈ సాయం ఎంతో మేలు చేస్తుంది.

– పి.రామకృష్ణ, నాయీ బ్రాహ్మణ లబ్ధిదారుడు

మదుపునకు ఢోకా లేదు



మూడేళ్లు ఈ పథకం వచ్చింది. ఈ ఏడాది కూడా వేస్తున్నారు. రజకులకు మదుపులకు ఇబ్బంది లేకుండా సీఎం చూసుకుంటున్నారు. పది కాలాల పాటు జగనే సీఎంగా ఉండాలి.

– ఎస్.గీత, రజక లబ్ధిదారు

క్లుప్తంగా

శ్రీకాకుళం ఆర్డీఓగా సూర్యకళ


ఎం. సూర్యకళ

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి బొడ్డేపల్లి శాంతికి బదిలీ అయ్యింది. ఆమె స్థానంలో విజయనగరం రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేస్తున్న ఎం. సూర్యకళను నియమించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వచ్చాయి. బొడ్డేపల్లి శాంతిని విజయనగరం జిల్లా చీపురుపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిగా నియమించారు.

పలాస ఆర్డీఓగా భరత్ నాయక్

పలాస: పలాస ఆర్డీఓగా భరత్ నాయక్ నియమితులయ్యారు. ప్రస్తుత ఆర్డీఓ సీతారామ్మూర్తిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్తగా ఏర్పాటైన పలాస రెవెన్యూ డివిజన్‌కు తొలి ఆర్డీఓగా సీతారామ్మూర్తి పనిచేశారు. ఆయనకు ఇంకా కొత్త స్థానం ఖరారు చేయలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై మడపాం టోల్‌గేట్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేటకు చెందిన గొలివి శివకుమార్‌కు గాయాలయ్యాయి. నరసన్నపేట నుంచి శ్రీకాకుళం ద్విచక్ర వాహనంతో వెళ్తుండగా ఆర్టీసీ బస్‌ను తప్పించి ముందుకు వెళ్తున్నప్పుడు ప్రమాదం జరిగింది. గాయపడిన మోహనరావును ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో శ్రీకాకుళం తరలించారు.

యోగా విజేతలకు అభినందనలు


మహంతి శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: రాష్ట్రస్థాయిలో యోగా పోటీల్లో రాణించిన వారిని ఎస్పీ జీఆర్ రాధిక అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఎస్పీ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి 36వ యోగాసనం చాంపియన్ షిప్ పోటీల్లో ఇచ్ఛాపురానికి చెందిన మహంతి శ్రీకాంత్ మొదటి స్థానంలో, సాయి జగదీష్ 5వ స్థానంలోనూ నిలిచి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. మహంతి శ్రీకాంత్, యోగా ట్రైనర్ హిమ గురువారం ఎస్పీ రాధికను కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని మరి కొందరు పిల్లలు, యువత యోగాలో రాణించే విధంగా తీర్చిదిద్దాలని కోరారు.

మారిన తత్కాల్ టికెట్ టైమ్‌టేబుల్



కాశీబుగ్గ: ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ పరిధిలో ఉన్న పలాస రైల్వేస్టేషన్‌లోని టిక్కెట్ రిజర్వేషన్ పొందే కౌంటర్ తెరిచే సమయాల్లో మార్పులు చేశారు. శనివారం నుంచి తత్కాల్ రిజర్వేషన్ సమయ పాలనలో మార్పులు చేశారు. ప్రతి రోజు తీసుకునే తత్కాల్ టిక్కెట్‌లలో ఉదయం పదిగంటలకు ఏసీ రిజర్వేషన్‌కు సంబంధించిన టిక్కెట్లు ఇస్తారు. తత్కాల్‌లో స్లీపర్ టికెట్ పొందాలనుకునేవారు ఉదయం పదకొండు గంటలకు హాజరుకావాల్సి ఉంటుందని నోటీసు బోర్డులో పేర్కొన్నారు. పలాస రిజర్వేషన్ కౌంటర్‌లో అన్ని రకాల క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులతో నగదు లావాదేవీలు జరుపుకునే సౌలభ్యం కల్పించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

టెక్కలి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక డిపో ఎదురుగా ధర్నా నిర్వహించారు. అన్ని రకాల సిక్‌ల పై జీతాలు ఇవ్వాలని, సస్పెన్షన్ అయిన ఉద్యోగులకు మళ్లీ అదే డిపోలో ఉద్యోగాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వై.అప్పయ్య, బీడీజె.రావ్, వీకే దేవ్, ఆర్‌కె.రావ్, ఎం.ఎస్.చలం, రమేష్, కేబీ రావ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా మన్‌కీ బాత్ కన్వీనర్‌గా వేణుగోపాల్

టెక్కలి: బీజేపీ ఓబీసీ మోర్చా మన్‌కీ బాత్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా టెక్కలికి చెందిన వంజంగి వేణుగోపాల్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉత్తర్వులు పంపించారని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235


సిక్కోలు మణిపూసలు

- జిల్లాకు చెందిన ముగ్గురికి వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రకటన
- పురస్కారాలకు కరణం మల్లీశ్వరి, అట్టాడ అప్పలనాయుడు, కోన సన్యాసి ఎంపిక

ఒకరేమో సిక్కోలు కీర్తి పతాకాన్ని ఒలింపిక్స్ వేదికగా ఎగరేసిన ధీర వనిత. ఇంకొకరేమో అక్షరాల సాయంతో దశాబ్దాలుగా సాహితీ యజ్ఞం సాగిస్తున్న ధీశాలి. మరొకరు అనాదిగా వస్తున్న కళను కాపు కాసి బతికిస్తున్న ధీమంతుడు. ఈ ముగ్గురికి ఈ ఏడాది వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవా ర్డులు ప్రకటించారు. కరణం మల్లీశ్వరి, అట్టాడ అప్పలనాయుడు, కోన సన్యాసిలకు ఈ అవార్డులు ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

– శ్రీకాకుళం న్యూకాలనీ, ఆమదాలవలస, శ్రీకాకుళం కల్చరల్, ఎచ్చెర్ల క్యాంపస్

మన వనిత


సిడ్నీ ఒలింపిక్స్‌లో కరణం మల్లీశ్వరి

కరణం మల్లీశ్వరి.. పరిచయం అక్కర్లేని పేరు. శ్రీకాకుళం పేరు చెబితే అప్పటివరకు హేళన చేసిన వారందరి చేత చప్పట్లు కొట్టించిన వెయిట్ లిఫ్టర్. జిల్లా కీర్తి పతాకాన్ని ఒలింపిక్స్ వేదికగా సగర్వంగా ఎగరేసిన క్రీడాకారిణి. ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ కానిస్టేబుల్‌గా పనిచేసిన కరణం మనోహర్, శ్యామల మూడో సంతానమే మల్లీశ్వరి. పదమూడేళ్ల వయసులో అక్క అప్పలనరసమ్మ స్ఫూర్తితో ఆమె వెయిట్‌లిఫ్టింగ్‌పై ఇష్టం పెంచుకున్నారు. 1994, 1995లలో 54 కేజీల విభాగంలో రెండుసార్లు వరల్డ్ టైటిల్ సాధించి చాంపియన్‌గా నిలిచారు. ఒక్కో మెట్టు ఎక్కుతూ అందరినీ ఆశ్చర్యపరిచిన మల్లీశ్వరి 2000 సంవత్సరంలో సిడ్నీ ఒలింపిక్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించి దేశ క్రీడారంగాన్ని ఒక్కసారిగా తన వైపు తిప్పుకున్నారు. క్లీన్ అండ్ జర్క్ విభాగంలో ఆమె సెట్ చేసిన రికార్డు ఆమె సత్తాను ప్రపంచానికి చాటి చెప్పింది. ఒలింపిక్ మెడల్‌కు ముందు ఆమె 29 అంతర్జాతీయ పతకాలు సాధించారు. ఆమెకు నలుగురు అక్క చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు. కరణం మల్లీశ్వరి ఎన్నో అవార్డులు,రివార్డులు అందుకున్నారు. 1999లో ప్రతిష్టాత్మక రాజీవ్ గాంధీ ఖేల్ రత్న, 1994లో అర్జున అవార్డు, 1999లో పద్మశ్రీ అవార్డులు వరించాయి. 2021లో ఢిల్లీ స్పోర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ (వీసీ)గా నియమితులయ్యారు. ఆమె వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక కావడంపై ఆమదాలవలసకు చెందిన క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

చాలా సంతోషంగా ఉంది..



వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్‌కు ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. నాకు సమాచారం తెలియజేశారు. తెలిసిన వెంటనే చాలా ఆనందం వేసింది. క్రీడాకారులకు అవార్డులు, రివార్డులు ఎంతో గౌరవాన్ని అందిస్తాయి. మరింత ప్రోత్సాహాన్ని, ప్రేరణను కలిగిస్తాయి. ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తాయి.

– కరణం మల్లీశ్వరి, ఒలింపియన్ మెడలిస్ట్

సాహితీ శిఖరం


రచయిత అట్టాడ అప్పలనాయుడు

ఉత్తరాంధ్ర సాహితీ చరిత్రలో తనకంటూ ఓ అధ్యాయం లిఖించుకున్నారు అట్టాడ అప్పలనాయుడు. ఈయన స్వగ్రామం కొమరాడ మండలం గుమడ గ్రామం. 1953 ఆగస్టు 23న జన్మించారు. హైస్కూల్ స్థాయిలోనే శ్రీకాకుళ సాయుధ పోరాటం వైపు ఆకర్షితులయ్యారు. పార్వతీపురంలో ఇంటర్ చదివారు. జంఝావతి రిజర్వాయర్ నిర్మాణంలో కూలిగా పనిచేశారు. నాగావళి వారపత్రికలో పనిచేసి ఆ తర్వాత గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం సాధించారు. సాహిత్య అకాడమీ తెలుగు విభాగం సలహా మండలి సభ్యులుగా, కథానిలయం ట్రస్టు సభ్యులుగా, ఉత్తరాంధ్ర రచయితల, కళాకారుల వేదిక అధ్యక్షులుగా కూడా ఉన్నారు. శ్రీకాకుళ సాహితీ సంస్థ ఏర్పాటులో అట్టాడది కూడా కీలక పాత్ర. నాగావళి కథలు, వంశధార కథలు, జంఝావతి కథలు కథాసంకలనాలను సంస్థ తరపున ప్రచురించారు. ఈయన వందకుపైగా కథలు, నాలుగు నవలలు, కొన్ని నాటికలను రచించారు. శ్రీకాకుళం ఉద్యమానికి ఆకర్షితులై విప్లవ కథకుడిగా పేరు సంపాదించారు. ఈయన మడిసెక్క నాటకం అన్ని భారతీయ భాషలలోకి అనువదించారు. తన రచనలకు గాను లెక్కకు మిక్కిలి పురస్కారాలను అందుకున్నారు. ఇటీవలే నవలా ప్రక్రియలో 'బహుళ' రచనకు పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారు తెలుగు సాహితీ పురస్కారానికి ఎంపిక చేశారు. ఇప్పుడు వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుకు కూడా ఎంపికయ్యారు. ఇది తనకు అతి పెద్ద అవార్డు అని ఆయన తెలిపారు. కమిటీకి ధన్యవాదాలు చెబుతున్నట్లు ప్రకటించారు.

ఘన వారసత్వం


కోన సన్యాసి

తప్పెటగుళ్లు.. అనాదిగా సిక్కోలు కాపాడుకుంటూ వస్తున్న కళ. దేవుడి సంబరాలు, ఊరేగింపులకు ఒకప్పుడు పరిమితమైన ఈ కళ ప్రస్తుతం ప్రముఖుల స్వాగతాలకు, ప్రధానమైన కార్యక్రమాల్లోనూ కనిపిస్తోంది. ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురంలో 150 మంది వరకు ఈ కళాకారులు ఉండగా, కొన్ని దశాబ్దాల నుంచి కోన సన్యాసి ఇందులో రాణిస్తున్నారు. 63 ఏళ్ల సన్యాసి చదువుకోలేదు. అయినా ఆయన నోటి వెంట నుంచి వచ్చే పాట శృతి తప్పదు. తండ్రి కోన చిన్నప్పయ్య నుంచి వారసత్వంగా ఈ విద్యను స్వీకరించారు. ప్రస్తుతం తన తండ్రి పేరు మీద తప్పెటగుళ్ల బృందం నిర్వహిస్తూ రాణిస్తున్నారు. 51 ఏళ్లుగా అనేక ప్రదర్శనలు ఇచ్చారు. భారతం, రామాయణం, భాగవతం వంటి ఇతివృత్తాలను పాటలుగా చేసి పాడుకుంటూ వినోదాన్ని సందేశాన్ని కలగలిపి అందిస్తున్నారు. వీరి బృందం భారత స్వాతంత్ర్య వేడుకలు, గణతంత్ర్య వేడుకల్లో సైతం ప్రదర్శనలు ఇచ్చింది. ఆయనకు ఈ అవార్డు రావడంతో కళాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది

కళా రంగంలో వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు రావటం ఎంతో ఆనందంగా ఉంది. 1970 నుంచి ప్రదర్శనలు ఇస్తున్నాను. నా తండ్రి, గురువు చిన్నప్పయ్య పేరుతో మేము ఆడుతుంటాం. మా ఎస్.ఎం.పురం గ్రామంలో చాలా మంది తప్పెటగుళ్ల కళాకారులు ఉన్నారు. పురాణాలు, ఇతిహాసాల ఇతివృత్తాలతో కూడిన అంశాలతో ప్రదర్శనలు ఇస్తాం. నిరంతరం సాధన చేస్తూ ప్రదర్శన మెరుగు పర్చుకుంటూ ముందుకు సాగుతున్నాం.

– కోన సన్యాసి, తప్పెటగుళ్ల కళాకారుడు

పేదోడికి భరోసా జగనన్న పాలన


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రతి పేదవాడికీ భరోసా ఇచ్చేలా వైఎస్ జగన్ పాలన సాగుతోందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని సన్ రైజ్ ఫంక్షన్ హాల్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం నగర శాఖ క్లస్టర్ 1 పరిధిలో నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మాన మాట్లాడుతూ కార్యకర్తలంతా నాలుగున్నరేళ్లుగా నిబద్ధతతో పనిచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మళ్లీ అధికారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దక్కేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ఊరూరా పండగలా జరుగుతోందన్నారు. మంచి రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక్కసారి విద్యావ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులు గమనించాలని కోరారు. వృద్ధులకు కూడా ప్రభుత్వం తోడుగా ఉంటోందని తెలిపారు. అభివృద్ధికి సంబంధించి పట్టణంలో జరిగిన మార్పులు గమనించాలని కోరారు. పెద్ద మార్కెట్, పెద్దాస్పత్రి, రోడ్లు, శానిటేషన్‌లో అనూహ్య మార్పులు చేశామన్నారు.

కార్యక్రమానికి నగర శాఖ బాధ్యులు (క్లస్టర్ –1) చౌదరి సతీష్ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పట్టణ వైఎస్సార్సీపీ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మెంటాడ పద్మావతి, కోణార్క్ శ్రీనివాసరావు, గురుగుబెల్లి లోకనాథం, ఎన్ని ధనుంజయరావు, మండవిల్లి రవి, శిమ్మ రాజశేఖర్, ఆలుగుబెల్లి నాగభూషణరావు, బైరి మురళి, బరాటం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడు అరెస్టు


మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం చెరువు గట్టుపై ఉన్న కాలనీకి చెందిన గొర్లె శ్రీదేవి హత్య కేసును నరసన్నపేట పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. నిందితుడు లబ్బ ఎర్రన్నను అరెస్టు చేసినట్లు నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు గురువారం తెలిపారు. శ్రీదేవి మంగళవారం హత్యకు గురైన విషయం విదితమే. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని సీఐ విలేకరులకు వివరించారు. కొన్ని నెలలుగా శ్రీదేవితో ఎర్రన్న వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారని, అందులో భాగంగా సోమవారం రాత్రి 10.30 సమయంలో ఆమె ఇంటికి ఎర్రన్న వెళ్లారని అన్నారు. తనతో కాకుండా మరో వ్యక్తితో శ్రీదేవి మాట్లాడుతూ సన్నిహితంగా ఉంటున్నట్లు అనుమానించిన ఎర్రన్న ఆమెను ప్రశ్నించగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగానే ఆమె గొంతును ఎర్రన్న కత్తితో కోసినట్లు వివరించారు. ఈ ఘటనపై శ్రీదేవి తల్లి సరస్వతి మంగళవారం ఫిర్యాదు ఇచ్చారని, వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి నిందితుల కోసం గాలించామని అన్నారు. అనుమానంతో ఉర్లాం పంచాయతీ కుమ్మరిపేటకు చెందిన లబ్బ ఎర్రన్నను గురువారం తన ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చి ప్రశ్నించగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడని చెప్పారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం ఉన్నారు.

జాతీయ పోటీల్లో మనోళ్ల హవా



పతకాలు సాధించిన క్రీడాకారులు, స్టార్ ఆఫ్ ఇండియా గాయత్రితో అజయ్, కృష్ణంరాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పూర్తి హవా కనబర్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాయ్ వేదికగా ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు 42వ సబ్-జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు విజేతగా నిలిచి స్వర్ణం సాధించగా, బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచి రజత పతకం సొంతం చేసుకుంది. అలాగే బాలుర డబుల్స్‌లో బంగారు పతకం, బాలికల డబుల్స్‌లో కాంస్య పతకం సాధించడంతోపాటు, మిక్స్‌డ్ డబుల్స్ పసిడి పతకం సాధించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్లకు శ్రీకాకుళం జిల్లా నుంచి బాలికల విభాగంలో ముంత గాయత్రి, సింగూరు నందిని, బాలుర విభాగంలో లబ్బ మణికంఠ, నర్సీపురం ప్రవీణ్ కుమార్ ప్రాతినిధ్యం వహించడంతోపాటు జట్లను విజయపథంలో నిలపడంలో కీలక భూమిక వహించారు.

స్టార్ ఆఫ్ ఇండియాగా ఎచ్చెర్ల క్రీడాకారిణి

ఈ మెగా టోర్నీలో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడంతోపాటు జట్టును ముందుండి నడిపించిన శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్లకు చెందిన ముంత గాయత్రి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును అందుకుంది. ఈ ఫీట్ సాధించిన మొట్టమొదటి శ్రీకాకుళం జిల్లా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. గతంలో రెండు పర్యాయాలు స్టార్ ఆఫ్ ఆంధ్రాగా ఎంపికై అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. వీరిని ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు, జిల్లా అధ్యక్షుడు కోత పూర్ణచంద్రరావు, ప్రధాన శిక్షకులు, ప్రోత్సాహకులు, ఇంటిలిజెన్స్(పలాస) ఎస్ఐ యానాల తారకేశ్వరరావు, ఎం.మధుసూదనరావు, చీఫ్ రిఫరీ ఎస్.అజయకుమార్, జిల్లా సంఘం ప్రతిధులు అభినందించారు.

ఎండిన పంటల పరిశీలన


బెల్లుకోలలో ఎండిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

నందిగాం: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో మండలంలో ఎండిపోతున్న పంట పొలాలను జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు కె.కృష్ణారావు, సీహెచ్ వెంకటరావు, స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు తిరుమలరావు, ఏఓ శ్రీకాంత్ వర్మలు పరిశీలించారు. వారు గురువారం మండలంలోని కొండల ప్రాంత గ్రామాలైన నౌగాం, బెల్లుకోల, మదనాపురం గ్రామాల్లో పర్యటించి నీరు లేక ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండిన పంటల నివేదకలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

మల్లన్న సన్నిధిలో అలరించిన భజనలు

టెక్కలి: రావివలస మల్లన్న సన్నిధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక పరిషత్ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన భజన కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ ఎస్.బాలకృష్ణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సుధాకర్ ఆధ్వర్యంలో పలువురు భక్తి గీతాలతో భజనలు చేశారు. అనంతరం మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సువర్ణాపురంలో జిల్లాస్థాయి డిబేట్ పోటీలు


విజేతలను సన్మానిస్తున్న దృశ్యం

మందస: మండలంలోని సువర్ణాపురంలో జిల్లా స్థాయి డిబేట్ పోటీలు గురువారం నిర్వహించారు. నవభారత్ నిర్మాణసేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో సోంపేట మండలంలోని బేసి రామచంద్రపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి చంద్రశేఖర్ ప్రథమ స్థానం సాధించాడు. సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వై.ఢిల్లీరావు ద్వితీయస్థానం, తృతీయ స్థానాన్ని సువర్ణాపురానికి చెందిన నందు, కన్సొలేషన్ బహుమతి డి.చాణక్య గెలుచుకున్నారు. విజేతలకు మెమెంటో, పతకం, నగదులతో సన్మానించారు. సొండిపూడి విద్యార్థి ఢిల్లీరావును హెచ్ఎం బి.సుందర్‌సాల్మన్, ఉపాధ్యాయుడు నగిరి కరుణాకర్ అభినందించారు.

29న జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్

శ్రీకాకుళం న్యూకాలనీ: కొన్న చిన్నారావు మెమోరియల్ క్రీడా పోటీలు అక్టోబర్ 29వ తేదీన (ఆదివారం) నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ ముఖ్య ప్రతినిధులు కొన్న సత్యనారాయణ, కొన్న వెంకటేశ్వరరావు (వాసు), కొన్న మధుసూదనరావు, ప్రగాడ అశోక్‌కుమార్, పూడి బాలాదిత్య, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. అథ్లెటిక్స్‌లో అండర్–14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా 100 మీటర్లు, 400, 800, 2వేలు, 3వేలు, 5వేల మీటర్ల పరుగు పందాలు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో తదితర కేటగిరీల్లో పోటీలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే తైక్వాండోలో సబ్-జూనియర్స్‌లో 13 వేయింగ్స్, కేడిట్‌లో 10, జూనియర్స్‌లో 10, సీనియర్స్‌లో 8 వెయింగ్స్‌లో బాలబాలికలకు పోటీలను జరపనున్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. ఇక్కడ రాణించిన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. వివరాలకు, తమ సందేహాలు నివృత్తి కోసం జిల్లా అథ్లెటిక్స్ సంఘ ప్రధాన కార్యదర్శి, పీడీ ఎం.సాంబమూర్తి (8500271575) ని సంప్రదించవచ్చని సూచించారు.

మృత్యు తీగలు

- విద్యుత్ షాక్‌తో తల్లీకూతుళ్లు మృతి
- శ్రీకాకుళంలో ఘటన


మృతి చెందిన తల్లి పార్వతీ, కూతురు దీప్తి

శ్రీకాకుళం రూరల్: అప్పటి వరకు తల్లీకూతుళ్లు సరదాగా గడిపారు. సాయంత్రం బయటకు వెళ్లి నవరాత్రి ఉత్సవాలను తిలకించారు. కానీ ఇంటిలో చావు వారి కోసం వేచి ఉందని తెలియలేదు. రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వచ్చిన వీరిద్దరూ కాసేపటికే మృత్యు ఒడికి చేరుకున్నారు. విద్యుత్ తీగల రూపంలో పొంచి ఉన్న మృత్యువు ఇద్దరినీ తనతో తీసుకెళ్లిపోయింది. శ్రీకాకుళం అరసవల్లి పరిధిలోని ఆదిత్య నగర్ కాలనీ 5వ లైన్‌లో గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనలో కేశంశెట్టి పార్వతి (45) కేశంశెట్టి దీప్తి (18)లు మృతి చెందారు. ఈ దుర్ఘటనతో ఆ కాలనీ విషాదంగా మారింది. పూర్తి వివరాల్లోకి వెళితే..

పార్వతి ఖాజీపేట పరిధిలోని స్వీపర్‌గా పనిచేస్తున్నారు. దీప్తి ఇంటర్ పూర్తి చేసుకుని అవని కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో జాయినైంది. గురువారం సాయంత్రం తల్లీకూతుళ్లు స్థానికంగా ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవాలకు వెళ్లారు. రాత్రి 8 గంటల వరకు అక్కడే గడిపి ఆ తర్వాత ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చాక తల్లి పార్వతి పెరట ఆరబెట్టిన దుస్తులు తీద్దామని వెళ్లారు. దుస్తులు తీస్తుండగా అక్కడే విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టడంతో నించున్న చోటనే ఊపిరి వదిలేశారు. తల్లి ఎంత సేపటికీ రాకపోవడంతో కుమార్తె పెరటకు వెళ్లి తల్లిని పట్టుకుని లాగబోయింది. దీంతో ఆమెకు కూడా షాక్ తగిలి అక్కడే మృతి చెందింది. పక్కింటి వాళ్లు వారిని చూసి స్థానికులకు సమాచారం అందించారు. విద్యుత్ సిబ్బందికి విషయం చెప్పడంతో ఎలక్ట్రికల్ ఏఈ కమలాసన్, లైన్ మెన్‌లు లక్ష్మీనారాయణ, సుబ్రమణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్ కావడం వల్ల దుస్తులు ఆరబెట్టిన తీగలకు విద్యుత్ పాకి ఉంటుందని వారు తెలిపారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు వచ్చి మృతదేహాలను రిమ్స్‌కు తరలించారు.

ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం



రాష్ట్ర నూతన కార్యవర్గం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించే దిశగా తమ సంఘం పనిచేస్తోందని ఎస్సీ,ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పోతల దుర్గారావు అన్నారు. సీఎం దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడి గా పోతల దుర్గారావు, రాష్ట్ర అధ్యక్షుడిగా బొంత సుబ్బారాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొప్పల డేనియల్, ఉపాధ్యక్షులుగా ఎండీఎస్ రెడ్డి, ఎం.జోజప్ప ఆదోని, సంయుక్త కార్యదర్శిగా బి.చిన్నబాబు, ట్రెజరర్‌గా ఎ.ఆదినారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎంవీ అప్పారావు, లీగల్ అడ్వైజర్ వై.జయరాజ్, ఎమ్.శ్రీనివాసులు, రాష్ట్రకార్యదర్శులు ఎం.శ్రీనివాసులు, కె.జీవరత్నం, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఐదుగురు, ఈసీ మెంబర్స్‌గా 12మందిని ఎన్నుకున్నారు. విజయవాడలో ప్రెస్‌క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్లు పోతల దుర్గారావు తెలిపారు.